
# మీన మేషాలు..




**చెరువులకు** *చేపపిల్లలు చేరుతాయా? లేదా? అన్న మీమాంసలో మత్స్యకారుల కుటుంబాలు కొట్టుమిట్టాడుతున్నాయి. గతంలో సమయానికి చేపపిల్లలు రావడంతో జలాశయాల్లో మత్స్య సంపద వృద్ధి చెంది చేతినిండా ఆదాయాన్ని ఆర్జించాయి. వానాకాలం ప్రారంభమైనప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ చేపపిల్లల పథకంపై దృష్టి సారించినట్లుగా కనిపించడం లేదు. ఒకవేళ ప్రభుత్వం ఈ విషయంలో ప్రోత్సాహం అందించకపోతే మా పరిస్థితి ఏమిటంటూ మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు. కేసీఆర్ తీసుకువచ్చిన పథకాన్ని రాజకీయాలకు అతీతంగా అమలు చేయాలంటూ డిమాండ్ చేస్తున్నారు. 2016-17లో మొదలైన ఈ మత్స్య అభివృద్ధి కార్యక్రమం నిరాటంకంగా ఎనిమిది విడుతలు కొనసాగింది. 2024-25లో అమలుపైనే నీలినీడలు అలుముకున్నాయి.*

*-నిజామాబాద్, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

- గతమంతా ఘనంగా కార్యక్రమం
- కాంగ్రెస్ పాలనలో ఊసేలేని పథకం
- ఉచిత చేపపిల్లల కోసం ఎదురుచూపు
- ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు కరువు
- ఉమ్మడి జిల్లాలో ఏటా 7కోట్ల చేపపిల్లలు వినియోగం

**చెరువులు,** కుంటలు, భారీ నీటి పారుదల ప్రాజెక్టుల్లో చేపపిల్లల పెంపకానికి మత్స్యకారులను ప్రోత్సహించేందుకు గత ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించింది. 100శాతం రాయితీతో చేపపిల్లల విత్తనాన్ని అందించడంతో వారికి కొండంత భరోసాతోపాటు మత్స్యకారుల కుటుంబాలకు వెన్నుదన్నుగా కేసీఆర్ నిలిచారు. దీంతో గ్రామాల్లోని మత్స్యకారులు ధైర్యంగా బతికారు. 2014కు మునుపు కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల్లో వీరిని పట్టించుకున్నవారే కరువు. కనీసం రాయితీతో చేపపిల్లలను అందించకపోవడంతోపాటు చెరువులపై అజమాయిషీ చేసేందుకు సైతం మత్స్యకారులకు అవకాశం లేకపోయేది. రాష్ట్రం ఏర్పడి, ముఖ్యమంత్రిగా కేసీఆర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మిషన్ కాకతీయతో బాగుపడిన చెరువుల్లోకి చేపపిల్లలను వదిలారు. దీంతో మత్స్య అభివృద్ధికి కేసీఆర్ బాటలు వేశారు. 2024-25 సీజన్ ప్రారంభం నుంచి వానలు కొద్దిగా ముఖం చాటేసినప్పటికీ ప్రస్తుతం ఆశించిన స్థాయిలో చెరువుల్లోకి జలాలు వచ్చి చేరుతున్నాయి. వేలాది చెరువులు, కుంటలు మత్స్య అభివృద్ధికి దోహదం చేసేలా అనుకూలంగా మారుతున్నాయి. నీళ్ల బెంగ తీరుతున్న ఈ సమయంలో మత్స్యకారులకు ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత చేపిపిల్లలు వచ్చేనా? అనే అనుమానాలు కొట్టుమిట్టాడుతున్నాయి.

### ఏటా సుమారు 7కోట్ల చేపపిల్లలు..

చేపపిల్లల అభివృద్ధికి ఆయువు పోసేందుకు కేసీఆర్ హయాంలో ప్రణాళికబద్ధంగా రూపకల్పన జరిగింది. మొదటగా మిషన్ కాకతీయలో భాగంగా చెరువులను బాగుచేశారు. బాగుపడిన జలాశయాల్లో 2016-17లో తొలి విడుతలో చేపపిల్లలను వదిలారు. ఆ తర్వాత పునరుద్ధరణకు నోచుకున్న చెరువులన్నింటినీ గుర్తించి ప్రక్రియ కొనసాగించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చివరిసారిగా ఎనిమిదో విడుత 2023-24లో జరిగిన ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లాలో 1,018 చెరువుల్లో 4కోట్ల 72లక్షల చేపపిల్లలను వదిలారు. 10లక్షలకు పైగా రొయ్యల పెంపకాన్ని ప్రోత్సహించారు. కామారెడ్డి జిల్లాలోనూ 697 చెరువుల్లో 2కోట్ల 78లక్షల 60వేల చేపపిల్లలను వదిలి మత్స్య అభివృద్ధికి పాటుపడ్డారు. చెరువుల్లో చేపపిల్లలను వదిలే సమయంలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మత్స్య సహకార సొసైటీ బాధ్యుల సమక్షంలో సైజులు, చేపపిల్లల నాణ్యతను నిర్ధారించిన తర్వాత మాత్రమే చెరువుల్లోకి వదిలిపెట్టేలా మత్స్య శాఖ చర్యలు తీసుకున్నది. తద్వారా పారదర్శకంగా కార్యక్రమాన్ని చేపట్టింది.

## నిధులు లేక.. ఉత్పత్తికి బ్రేక్..



పోచంపాడ్‌లో నూతనంగా నిర్మించిన నర్సరీలు

మోర్తాడ్, ఆగస్టు 4: రాష్ట్రంలోనే నంబర్‌వన్‌గా ఉన్న మెండోరా మండలం పోచంపాడ్‌లోని జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఈసారి దయనీయంగా మారింది. ప్రభుత్వం ఏటా చేపపిల్లల ఉత్పత్తికి ఏప్రిల్-మే నెలల్లోనే నిధులను విడుదల చేసేది. దీంతో పనులు వేగంగా ప్రారంభమై సమయానికి చేపపిల్లలను ఉత్పత్తి చేసి మత్స్యకారులకు పంపిణీ చేసేవారు. కానీ ఈసారి నిధులు విడుదల కాకపోవడం శోచనీయం. ఏప్రిల్-మే నెలల్లో తల్లి చేపలను కొనుగోలు చేసి జూలైలో మొదటివారంలో చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభిస్తారు. ఆగస్టు నెల ప్రారంభమైనా చేపపిల్లల ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభం కాకపోవడం పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

### అధికారులు లేక..

పోచంపాడ్ వద్ద 32ఎకరాల్లో 254 నర్సరీలతో ఏర్పాటు చేసిన జాతీయ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రానికి ఏటా సకాలంలో నిధులు విడుదలయ్యేవి. నిధులు విడుదల కాని సమయంలో చేపపిల్లల ఉత్పత్తికి అధికారులే డబ్బులు వెచ్చించాల్సిన పరిస్థితులు ఉండడంతో అధికారులు ఇక్కడకు రావడం లేదని, ఇన్‌చార్జిగా నియమించిన అధికారి సెలవుపై వెళ్లడానికి కారణం కూడా అదేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### 8క్వింటాళ్ల తల్లిచేపల కొనుగోలు

చేపపిల్లల ఉత్పత్తికి ఏప్రిల్-మే నెలల్లో తల్లిచేపల ను సమీప చెరువుల నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చి మట్టిపాండ్‌లో ఉంచుతారు. ఈసారి ఎనిమిది క్వింటాళ్ల తల్లి చేపలను (బంగారుతీగ, బొచ్చ, రవ్వ రకాలు)కొనుగోలు చేశారు.

### 55లక్షల చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యం

ఈసారి 55లక్షల చేపపిల్లలు(అడ్వాన్స్‌డ్ ఫ్రై) ఉత్పత్తి లక్ష్యం కాగా ఇప్పటి వరకు ప్రక్రియ ప్రారంభం కాలేదు. 55లక్షల చేపపిల్లలను ఉత్పత్తికి 7.50కోట్ల స్పాన్‌లను పెంచాల్సి ఉంటుంది. ఇదంతా జూలై మొదటి వారంలోనే ప్రారంభించాల్సి ఉండగా ఇప్పటికీ మొదలు కాకపోవడంతో ప్రస్తుతం వాతావరణం అనుకూలిస్తుందా అనేది ప్రశ్నార్థకం మారింది. ఎకోహెచరీలను అమర్చాలి, తల్లిచేపలకు ఇంజెక్షన్లు ఇచ్చి నర్సరీల్లోకి వదలాలి, ఇవన్నీ జరగాలంటే నిధులు రావాల్సి ఉన్నది. ఇప్పటికీ తీసుకువచ్చిన తల్లి చేపల బిల్లులు చెల్లించాల్సి ఉన్నట్లు సమాచారం.

### కేసీఆర్ హయాంలో అదనంగా 140 నర్సరీలు

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపల ఉత్పతి కేంద్రా న్ని అభివృద్ధి చేసేదిశగా అడుగులు పడ్డాయి. మొదట 114 నర్సరీలు ఉండగా రూ.5కోట్లతో అదనంగా 140 నర్సరీలు, ట్రాన్స్‌ఫార్మర్, పైప్‌లైన్, ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణం చేపట్టి 2019లో అందుబాటులోకి తీసుకొచ్చారు. చేపపిల్లల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు నర్సరీలు నిర్మించినా.. ఈసారి మాత్రం నిధులు విడుదల కాక ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



### ప్రభుత్వం ఆదుకోవాలి



చందూర్, ఆగస్టు 4: పదేండ్ల నుంచి చెరువునే నమ్ముకొని బతుకుతున్నాం. గత ప్రభుత్వం గంగపుత్రుల అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం రూ.కోట్లు నిధులు మంజూరు చేసి చేపపిల్లలను చెరువులో ఉచితంగా వదిలింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా చెరువుల్లో ఉచితంగా చేపపిల్లలను విడుదల చేసి సహకరిస్తే మాకు ఉపాధి కల్పించిన వారవుతారు.

**- కొల్లూరి లాలాబోయి, ఘన్‌పూర్**

### వారం రోజుల్లో పనులు మొదలవుతాయి

వారం రోజుల్లో చేపపిల్లల ఉత్పత్తి పనులు ప్రారంభమవుతాయి. ఈసారి 55లక్షల చేపపిల్లల ఉత్పత్తి లక్ష్యంగా నిర్ణయించాం. రూ.5.75లక్షల నిధులు సమకూర్చాలని ప్రభుత్వానికి నివేదిక పంపించాం. ఏప్రిల్-మే నెలల్లోనే నిధులు మంజూరయ్యేవి. ఈసారి ఇంకా రాలేదు. ఎఫ్‌డీవోల బదిలీలు జరగడంతో ఇక్కడ ఎఫ్ఎఫ్‌వోకు ఇన్‌చార్జి ఇచ్చాం. ప్రస్తుతం అతను సెలవుపై వెళ్లాడు, త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చూస్తాం.

**- ఆంజనేయులు, ఏడీ మత్స్యశాఖ**

## రుణమాఫీ తిప్పలు

# రైతుల చక్కర్లు..

- బ్యాంకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- అర్హులైనా జాబితాలో కనిపించని పేర్లు
- రెండు విడుతల్లోనూ మాఫీ రాలేదని ఆందోళన



**అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని..** అన్నట్లు మారింది రైతుల పరిస్థితి. *ప్రభుత్వం ప్రకటించిన పంట రుణాల మాఫీ జాబితాలో పేర్లు లేకపోవడంతో అర్హులైన రైతులు ఆందోళన చెందుతున్నారు. బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మొన్నటి వరకు రూ.లక్షలోపు రుణమాఫీ కాని రైతులు తిరిగితే.. ప్రస్తుతం రూ.లక్షన్నర లోపు రుణాలు మాఫీకాని వారు చక్కర్లు కొడుతున్నారు. తీసుకున్న రుణాలను ఏటా రెన్యువల్ చేసుకుంటున్నప్పటికీ జాబితాలో పేరు లేకపోవడంతో విమర్శలు గుప్పిస్తున్నారు. వ్యవసాయాధికారుల వద్ద ప్రభుత్వ ప్రత్యేక వెబ్‌సైట్‌లో పరిశీలిస్తే నో ఫీడింగ్..అని చూపిస్తున్నట్లు పేర్కొంటున్నారు. దీంతో ఇది బ్యాంకర్ల తప్పిదమా? లేక ప్రభుత్వమే సరైన సమాచారం సేకరించలేదా అనే సందేహాలను వ్యక్తంచేస్తున్నారు.*

*- గాంధారి/పొతంగల్, ఆగస్టు 4*

### రుణమాఫీ కాలేదు..



మా ఊరిలోని కెనరా బ్యాంకులో రూ.70వేల పంట రుణం తీసుకున్నా. రూ.లక్షలోపు రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. ఎందుకు రాలేదో అర్థంకావడం లేదు. బ్యాంకులో ఉన్న పంట రుణాన్ని 2021లో రెన్యువల్ చేసిన. అయినా లిస్టులో పేరు లేదు. రెండో విడుత రూ.లక్షన్నర మాఫీ జాబితాలో అయినా వస్తుందని అనుకున్న.. అందులో కూడా రాలేదు. నాలాగే మా ఊళ్లో చాలా మంది రైతులు మాఫీ కాలేదని బాధ పడుతున్నారు.

**- ఉప్ప రమేశ్, గండివేట్, గాంధారి**

### కేసీఆర్ హయాంలో అయ్యింది.. ఇప్పుడు కాలేదు..



మా ఊరిలోని కెనరా బ్యాంకులో రూ.42వేల పంట రుణం తీసుకున్నా. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. గతంలో కేసీఆర్ రుణమాఫీ చేసినప్పుడు రూ.49 వేలు మాఫీ వచ్చింది. ఇప్పుడు రూ.42వేలు మాఫీ కాలేదు. ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రూ.రెండు లక్షలలోపు లోన్ ఉన్న ప్రతి ఒక్కరికీ మాఫీ చెయ్యాలే.

**- పిట్ల నారాయణ, గండివేట్, గాంధారి**

### ఎవరిని అడగాలో.. ఏమో..



పొతంగల్, ఆగస్టు 4: నేను 2018సంవత్సరంలో రూ.17వేలు క్రాప్ లోన్ తీసుకున్న. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం రెన్యువల్ చేసుకుంటూ వస్తున్న. రూ.లక్షలోపు రుణాలు ఉన్న వారికి మాఫీ వచ్చిందనగానే సంతోషపడ్డా. తీరా లిస్టు చూసేసరికి నా పేరే లేదు. అధికారులను అడిగితే రెండో విడుతలో వస్తుందని చెప్పారు. రెండో విడుత లిస్టులో కూడా నా పేరు రాకపోయే సరికి ఎవరిని అడగాలో అర్థం కావడం లేదు.

**- కొడిచర్ల చిన్న సాయిలు, రైతు**

### సరైన సమాధానం చెప్పడం లేదు..



పొతంగల్, ఆగస్టు 4: సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణ మాఫీ చేస్తానంటే మస్తు ఖుషీ అయిన. నాకు ఉన్న ఎకరం 6గుంటల భూమికి 2018లో రూ.69 వేలు క్రాప్ లోన్ తీసుకున్న. అప్పటి నుంచి రెన్యువల్ చేస్తూ వస్తున్న. రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. అధికారులను అడిగితే ఏదో ఒక పొరపాటు ఉండొచ్చని చెప్పారు. రెండో విడుతలో కూడా నా పేరు రాలేదు.

**- అక్కమ్మ సాయిబొయి, రైతు**

# అధికారుల ఉరుకులు.. పరుగులు

- కొత్తపల్లి పాఠశాలలో విచారణ చేపట్టిన డీఈవో
- నేడు రూ.18కోట్ల బిల్లులు విడుదల చేయనున్నట్లు వెల్లడి



ఏజెన్సీ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

కోటగిరి, ఆగస్టు 4: ఒక వార్తా కథనంతో ప్రభుత్వం దిగివచ్చింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చేసింది.. మరోవైపు మధ్యాహ్న భోజన ఏజెన్సీల బిల్లులు, కార్మికుల వేతన బకాయిలు చెల్లించేలా చేసింది. కోటగిరి మండలం కొత్తపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కారంతో భోజనం పెట్టడంపై నమస్తే తెలంగాణ దినపత్రికలో ఆదివారం ప్రచురితమైన కథనం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. దీంతో జిల్లాస్థాయి అధికారులు ఉరుకులు.. పరుగులు పెట్టారు. డీఈవో దుర్గాప్రసాద్, కోటగిరి తహసీల్దార్ గంగాధర్, ఎంఈవో నాగ్‌నాథ్ కొత్తపల్లి పాఠశాలను ఆదివారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం ఏజెన్సీ నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి జరిగిన విషయంపై ఆరాతీశారు. కూర ఎందుకు రుచికరంగా చేయలేదని, విద్యార్థులకు అన్నంతో కారం ఎందుకు ఇచ్చారని నిర్వాహకులపై డీఈవో ఆగ్రహం వ్యక్తంచేశారు. కారంతో భోజనం పెట్టడంపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ప్రశ్నించడంతో తమదే తప్పని నిర్వాహకులు ఒప్పుకున్నారు. భోజనం రుచికరంగా ఉండాలని, మళ్లీ ఫిర్యాదులు వస్తే ఏజెన్సీని రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

### నేడు రూ.18కోట్ల బిల్లులు విడుదల చేస్తాం..

మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలకు ఇప్పటి వరకు రూ.58.69కోట్లు విడుదల చేయడం జరిగిందని, మిగిలిన రూ.18కోట్లు నేడు(సోమవారం) విడుదల చేయనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు చెల్లించాల్సిన వంట ఖర్చులు, వంట కార్మికులకు రూ.వెయ్యి వేతనం జూన్ నెల వరకు చెల్లించడం జరుగుతున్నదని, వంట కార్మికులకు చెల్లించనున్న రూ. రెండువేల వేతనానికి సంబంధించిన బిల్లుల చెల్లింపు కోసం జూన్ నెల వరకు నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. జూలై నెల వేతనాలకు నేడు నిధులు విడుదల చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు.

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్వీట్..



ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కారం భోజనం పెట్టడంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఎమ్మెల్యే చేసిన ట్వీట్ రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కొత్తపల్లి ప్రభుత్వ పాఠశాలలో సరైన భోజనం లేక ఆకలితో ఉన్న విద్యార్థులు కారం, నూనెతో అన్నం కలుపుకొని కడుపు నింపుకొన్నారని, ప్రభుత్వం భావిభారత పౌరులు పట్ల ఇంత బాధ్యతారహితంగా వ్యవహరించడం బాధాకరమంటూ ట్వీట్ చేశారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి భోజన సామగ్రి బిల్లులు, కుక్, హెల్పర్ వేతనాల బకాయిల అంశాన్ని కూడా ట్వీట్ చేశారు.

## 7న పంటల సాగుకు ఎస్సారెస్పీ నీటి విడుదల



శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్

మోర్తాడ్, ఆగస్టు 4: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ ఆయకట్టు పరిధిలో వానకాలం పంటల సాగు కోసం ఈనెల 7న నీటిని విడుదల చేయనున్నట్లు ఎస్ఈ శ్రీనివాసరావు గుప్తా తెలిపారు. వానకాలం పంటలకు సాగునీరందించే ప్రణాళికపై తెలంగాణ నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సమీకృత నీటి ప్రణాళిక యాజమాన్య కమిటీ సమావేశ నిర్ణయం మేరకు కాకతీయ, సరస్వతీ, లక్ష్మి కాలువలకు నీటి విడుదల ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

### కొనసాగుతున్న ఇన్‌ఫ్లో..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఆదివారం 21,422 క్యూసెక్కుల వరద వచ్చిచేరుతున్నది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు(80.5టీఎంసీలు) కాగా, ఆదివారం ప్రాజెక్ట్‌లో 1079.7అడుగులు(44.266టీఎంసీల)నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి 723 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతున్నది. సరస్వతీ కాలువకు 10క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 482 క్యూసెక్కుల నీరు ఆవిరవుతున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎంపీ అర్వింద్.. పసుపు బోర్డు ఎక్కడ?

- బడా పారిశ్రామికవేత్తలకు రూ.కోట్ల మేర బకాయిల మాఫీ సరికాదు
- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖలీల్‌వాడి, ఆగస్టు 4: నిజామాబాద్‌లో పసుపు బోర్డు ఏర్పాటుపై ప్రధాని మోదీ ద్వారా హామీ ఇప్పించిన ఎంపీ ధర్మపురి అర్వింద్.. పసుపు బోర్డు ఎక్కడ పెట్టారో చూపించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. రెండోసారి ఎంపీగా అర్వింద్ గెలిచిన తర్వాత పసుపు బోర్డు ఊసేలేదని.. బోర్డు తెస్తారా లేదా అని ప్రశ్నించారు. సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాల రాజకీయ శిక్షణ తరగతులు, అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూనంనేని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే ప్రజలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులపై లెక్కలు వేస్తున్నారే తప్ప.. ఏమాత్రం పేదవాడికి అందుతున్నదని చూడడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు రూ.30లక్షల కోట్ల బకాయిలు మాఫీ చేశారని, పేదలకు మాత్రం చేసేందుకు మనసు ఒప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పద్మ, పి.సుధాకర్, ఓమయ్య, సాయిలు, విఠల్‌గౌడ్, చక్రపాణి, వివిధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.